సాక్షి
ఏలూరు
శుక్రవారం । 18 । అక్టోబర్ । 2024



ఆధార్ అప్‌డేట్‌కు అవకాశం

ఆధార్ అప్‌డేషన్‌కు ఈనెల 22 నుంచి ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 6 లక్షల మందికి పైగా ఆధార్ అప్‌డేట్ చేయాల్సి ఉంది. 8లో ▸



మెస్ టెండర్ల ఊసే లేదు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఎప్పటికి ప్రారంభమవుతుందో అంతుబట్టని విషయంగా మారింది. 8లో ▸

వైభవం.. వాసవీ రథోత్సవం

తాడేపల్లిగూడెంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో అమ్మవారి వెండి రథోత్సవం అంగ రంగ వైభవంగా జరిగింది. 8లో



న్యూస్‌రీల్

ఘనంగా వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): మహనీయుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా వారి మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను సునాయాసంగా సాధించవచ్చు అనడానికి వాల్మీకి మహర్షి జీవితం నిదర్శనమని కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్వో డి.పుష్పమణి, జిల్లా రజక సంఘం అధ్యక్షులు సీహెచ్ కట్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు



ధాత్రిరెడ్డి, జేసీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో 664 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 252 గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో శుక్రవారం నుంచి వచ్చేనెల 14 వరకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. భూ యాజమానులకు రీ సర్వేపై అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలు మేలు



మాట్లాడుతున్న ఆర్ఎం ప్రసాద్

కొయ్యలగూడెం: ప్రత్యామ్నాయ పంటలతో రైతులు ఆదాయం పొందాలని వర్జీనియా పొగాకు బోర్డు రీజనల్ అధికారి (రాజమండ్రి) జీఎల్‌కే ప్రసాద్ సూచించారు. ఎన్ఎల్ఎస్ పరిధిలోని ఐదు వర్జీనియా పొగాకు వేలం కేంద్రాల రైతులతో గురువారం కొయ్యలగూడెం వేలం కేంద్రంలో ఆయన సమావేశం నిర్వహించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, ఏఎస్ గ్రేసీ మార్గరెట్‌తో కలిసి రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. గత సీజన్ మాదిరిగా వచ్చే సీజన్ ఉండకపోవచ్చని, పొగాకు సంక్షోభం నుంచి బయటపడేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలన్నారు. బోర్డు సూచించిన పరిమితి మేరకు మాత్రమే పొగాకు పండించాలని అన్నారు. పొగాకు ఉత్పత్తి విషయంలో ఇతర దేశాల నుంచి పోటీ ఎదుర్కొనే అవకాశం ఉందని, ఈ సందర్భంగా ఏయే పంటల వలన రైతులకు లబ్ధి కలుగుతుందో వివరించారు. మార్టేరు రీసెర్చ్ స్టేషన్ నుంచి సీనియర్ సైంటిస్ట్ డా.సహదేవరెడ్డి, సీటీఆర్ఐ సైంటిస్ట్ డా.కస్తూరి కృష్ణ, స్టేట్ అగ్రికల్చర్ నుంచి పీజీ బుచ్చిబాబు, యువ చెన్నకేశవులు, హార్టికల్చర్ అధికారి ధీరజ్, పొగాకు రైతు సంఘ అధ్యక్షుడు కాకర్ల నంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో అపార అవకాశాలు



ఫెయిర్‌లో పాల్గొన్న ప్రతినిధులు

తాడేపల్లిగూడెం: యూఎస్ఏలో ఉన్నత విద్యను అభ్యసిస్తే అపార అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ కెరీర్ అలుమ్ని అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ కార్తీక్ శేషాద్రి అన్నారు. ఏపీ నిట్‌లోని ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, అలుమ్ని ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఇన్విక్టా కెరీర్ కన్సల్టెన్సీ సంయుక్త ఆధ్వర్యంలో అమెరికాలోని తొమ్మిది ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో గురువారం హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్‌మూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, అసోసియేషన్ డీన్‌లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ జి.సంతోష్‌కుమార్ పర్యవేక్షించారు.

పేరుపాలెం బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు

కార్తీకమాసం సమీపిస్తున్న దృష్ట్యా పేరుపాలెం బీచ్‌లో పటిష్ట ఏర్పాట్లు చేయాలని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదేశించారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నవంబర్ 1 నుంచి కార్తీకమాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో బీచ్‌లో ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. యాత్రికులను ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే సముద్రంలో స్నానాలకు అనుమతి ఇవ్వాలని ఆర్డీఓ దాసిరాజు ఆదేశించారు.



ద్వారకాతిరుమలలో శ్రీవారి అనివెట్టి మండపంలో కల్యాణ తంతు జరిపిస్తున్న అర్చకులు

చూసిన కనులదే భాగ్యం

వేడుకగా చినవెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం స్వామివారి తిరుకల్యాణోత్సవం గురువారం రాత్రి ఆలయ అనివెట్టి మండపంలో అట్టహాసంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల కల్యాణమూర్తులను మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చి రజిత సింహాసనంపై ఉంచి వేడుకను ప్రారంభించారు. వివిధ ఘట్టాలను పూర్తి చేసిన తర్వాత శుభముహూర్తాన మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవిందనామస్మరణల నడుమ అట్టహాసంగా జరిపించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు శ్రీవారికి పట్టువస్త్రాలను, రాష్ట్ర ప్రభుత్వం తరపున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వామివారు ఉదయం సింహ వాహనంపై తిరువీధి సేవ నేత్రపర్వంగా సాగింది. అనివార్య కారణాల వల్ల రాత్రి వెండి గరుడ వాహన సేవ రద్దయింది. ప్రత్యేక అలంకరణల్లో భాగంగా ఆలయ ముఖ మండపంలో స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. శుక్రవారం రాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం



కల్యాణ వేడుకను వీక్షిస్తున్న భక్తులు

ఎరువు.. ఏకరువు

రైతులంటే అలుసా ?

- జిల్లాకు సగం కూడా చేరని ఎరువులు
- 1.40 లక్షల టన్నులు అవసరం
- అందుబాటులో 47 వేల టన్నులే..
- యూరియాదీ అదేదారి
- అన్నదాతలను కనికరించని ప్రభుత్వం



వరి పంటకు ఎరువులు చల్లుతున్న రైతు (ఫైల్)

ఏలూరు (మెట్రో): ఓ వైపు ప్రకృతి విపత్తులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు కూటమి ప్రభుత్వం సైతం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను నీరు గారుస్తోంది. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలు పొందే అవకాశాన్ని దూరం చేస్తూ.. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సేవలందించేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో రైతులు ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

4.76 లక్షల ఎకరాల్లో..

జిల్లావ్యాప్తంగా 4,76,484 ఎకరాల్లో రైతులు పలు రకాల పంటలు సాగుచేస్తున్నారు. ప్రధానంగా వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుండగా పొగాకు, మిర్చి, వేరుశనగ వంటి పంటలను సీజన్ వారీగా పండిస్తున్నారు. ఇలా జిల్లాలో వ్యవసాయం మీద ఆధారపడి 1,98,179 మంది రైతులు ఉన్నారు. వీరికి పంటలకు అనుగుణంగా ఎరువుల అవసరాలను తీర్చాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్నికల హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పేరుతో ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి సర్కారు కనీసం గత ప్రభుత్వం ఇచ్చిన రైతు భరోసా సొమ్ములు కూడా ఇవ్వలేదు.

ప్రకృతి ప్రకోపంతో..

రైతులు పండించే పంటలను ప్రకృతి విపత్తులు దెబ్బతీస్తున్నాయి. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఎరువులు సకాలంలో అందించాల్సిన సర్కారు రైతులను ఇబ్బందులు పెట్టే పరిస్థితికి తీసుకువెళ్లింది. జిల్లాలో రబీ సాగు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఎరువులను అందుబాటులో ఉంచలేదు. సాగు ఆరంభం నుంచి అల్పపీడనాలు, వాయుగుండాల ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదు.

అరకొరగా అందుబాటులో..



జిల్లావ్యాప్తంగా 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి యూరియా 50,380 టన్నులు అవసరం కాగా ప్రస్తుతం 13,345 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. అలాగే డీఏపీ 11,424 టన్నులు అవసరం కాగా కేవలం 2,816 టన్నులు అందుబాటులో ఉంది. ఎంవీకే 44,907 టన్నులకు 25,598 టన్నులు, ఎంఓపీ 17,609 టన్నులకు 4,431 టన్నులు అందుబాటులో ఉంది. ఎస్ఎస్‌పీ 16,054 టన్నులు అవసరం కాగా 6, 532 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. జిల్లావ్యాప్తంగా మొత్తంగా 1,40,374 టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటికీ 47,722 టన్నులు మాత్రమే ప్రభుత్వం అందుబాటులో ఉంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మద్యం షాపు ఏర్పాటుపై మండిపాటు



లింగపాలెంలో ఆందోళనకారులతో చర్చిస్తున్న పోలీసులు

లింగపాలెం: లింగపాలెంలో కొత్తగా మంజూరైన మద్యం షాపును చర్చిల మధ్య, దళితవాడల వద్ద పెట్టవద్దంటూ గ్రామానికి చెందిన పుల్లవారిగూడెం వాసులు ఆందోళనకు దిగారు. గురువారం రాత్రి పెద్ద ఎత్తున రోడ్డుపై చేరి ధర్నా చేపట్టారు. మద్యం దుకాణాన్ని ఇళ్ల వద్ద, రోడ్డు పక్కన, చర్చి, గుడుల సమీపంలో నిర్వహిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. దళితవాడ సమీపంలో మద్యం దుకాణంతో తాము తీవ్ర ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ధర్మాజీగూడెం ఎస్సై కె.వెంకన్న హుటాహుటిన ఆందోళనకారుల వద్దకు వచ్చి వారితో చర్చలు జరిపారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

వైఎస్సార్‌సీపీ మహిళా నేతపై దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న స్వరూపరాణి

చాట్రాయి: వైఎస్సార్‌సీపీ మహిళా నేత పెదగర్ల స్వరూపరాణిపై తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు దాడి చేసి గాయపరచిన సంఘటన చాట్రాయి మండలం కాట్రేనిపాడులో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన కోన లలిత కుమారి వెలుగు పథకంలో బుక్ కీపర్‌గా పని చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమెను అనధికారికంగా తొలగించి మరొకరిని నియమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. విషయం తెలుసుకున్న లలితకుమారి తనను తొలగించవద్దంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలోనే ఆమె వైఎస్సార్‌సీపీ స్టేట్ హిస్టరీ అకాడమీ మాజీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణిని కలిసి తన సమస్య వివరించారు. ఆమె సూచన మేరకు సోమవారం డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. విషయం తెలిసిన స్థానిక టీడీపీ మహిళా నేతలు ఆమర్తల లక్ష్మి, ముత్తవరపు ప్రభ బుధవారం రాత్రి 8 గంటల సమయంలో కాట్రేనిపాడులోని వైఎస్సార్‌సీపీ మహిళా నేత స్వరూపరాణి ఇంటికి వెళ్లి దూషణలకు దిగారు. మా ప్రభుత్వం వచ్చాకా నీ పెత్తనం ఏమిటంటూ దుర్భాషలాడుతూ ఇనుప చువ్వతో కొట్టి గాయపరిచారు. దీంతో తీవ్ర గాయాలపాలైన స్వరూపరాణిని కుటుంబసభ్యులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గురువారం ఈ ఘటనపై స్వరూపరాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చిరంజీవి చెప్పారు.

బాల్య వివాహాలను నివారించాలి

కలెక్టర్ వెట్రి సెల్వి



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మిషన్ వాత్సల్య రెండో త్రైమాసిక సమావేశాన్ని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్‌తో కలిసి ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలపై సమాచారం అందించేందుకు 1098 టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. మిషన్ వాత్సల్య ద్వారా 18 ఏళ్లలోపు వారికి ప్రభుత్వం ఆదరణ, సంరక్షణ కల్పిస్తుందన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కొన్ని హాస్టళ్లను తనిఖీ చేశామని చెప్పి గుర్తించిన లోపాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సీహెచ్ సూర్యచక్రవేణి, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి కేఎల్‌వీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

పీఎం సురక్షపై.. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకాలపై పంచాయతీ స్థాయిలో వచ్చే జనవరి 15 వరకు నిర్వహించే కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. లీడ్ బ్యాంక్ మేనేజరు డి.నీలాద్రి, బ్యాంకు అధికారులతో ఆమె సమీక్షించారు. పీఎంఎస్‌బీవై, పీఎంజేజేబీవై ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకర్లు ప్రభుత్వ పథకాల గురించి జిల్లాలోని 547 గ్రామ పంచాయతీలలోని ప్రజలకు నేటి నుంచి జనవరి 15, 2025 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. జన సురక్ష పథకానికి సంవత్సరానికి రూ.20 ప్రీమియం చెల్లించాలని, జీవన జ్యోతి పథకానికి రూ.436 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామస్థాయిలో ఈ పథకాలపై అవగాహన కల్పించి ఎన్‌రోల్‌మెంట్ చేయించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లాలో మిషన్ శక్తి పథకంలో వన్‌స్టాప్ సెంటర్ కార్యక్రమాలు, భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమాలపై అధికారులతో ఆమె సమీక్షించారు. కార్య క్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు.

టెట్‌కు 331 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని రెండు కేంద్రాల్లో గురువారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం సెషన్‌లో 185 మందికి 161 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 185 మందికి 170 మంది హాజరయ్యారని డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

సొంత జిల్లాలోనే శిక్షణకు వినతి

నూజివీడు: సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఆరు రోజుల ఎఫ్ఎల్ఎన్ రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను వారి సొంత జిల్లాల్లోనే ఏర్పాటు చేయాలని సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్‌జీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొక్కెరగడ్డ సత్యం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 21 నుంచి ప్రారంభమయ్యే శిక్షణ తరగతులను వేరే జిల్లాల్లో నిర్వహించడం వ్యయ ప్రయాసలతో కూడుకున్నదన్నారు. 26 జిల్లాలకు కేవలం తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడే శిక్షణ తరగతులను నిర్వహించడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే పాఠశాల సముదాయ సమావేశాల్లో ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ ఇస్తున్నారని, మరలా ప్రత్యేక శిక్షణ ఎందుకని ప్రశ్నించారు.

యువత.. ఉత్సాహ భరిత

ఆకట్టుకున్న జిల్లాస్థాయి యువజనోత్సవాలు







విద్యార్థులు డ్యాన్సులతో సందడి చేశారు.. ఆటపాటలతో ఉర్రూతలూగించారు. ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు-2024 నిర్వహించారు. జానపద నృత్యం, గీతం, కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, వక్తృత్వం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. ముందుగా కార్యక్రమాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. సెట్‌వెల్ సీఈఓ ప్రభాకరరావు మాట్లాడారు. జిల్లా యువజన అధికారి డి.కిషోర్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

-ఏలూరు (ఆర్ఆర్‌పేట)







క్లుప్తంగా

19న భీమవరంలో చెస్ పోటీలు


చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన భీమవరంలోని ఆర్య వైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజు భవనం)లో డిస్ట్రిక్ట్ లెవెల్ ర్యాంకింగ్ చెస్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. గురువారం పోటీలకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు అరసవల్లి ఈశ్వరమ్మ వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం సహకారం అందిస్తున్నారని తెలిపారు. వివరాలకు ఫోన్: 9063224466లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

19 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు


బ్యాడ్మింటన్ పోటీల వివరాలు వెల్లడిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ జగపతిరాజు

భీమవరం: ఈ నెల 19, 20 తేదీల్లో భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జేఎన్టీయూ–కే 'మెన్ అండ్ ఉమెన్' సెంట్రల్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ కళాశాల క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వీటితో పాటు ఈ నెల 26, 27 తేదీల్లో బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ 'మెన్ అండ్ ఉమెన్' సెంట్రల్ జోన్ పోటీలు కూడా తమ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే సురేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు సౌత్ జోన్‌కు వెళ్లే టీమ్‌లను కూడా ఇక్కడే యూనివర్సిటీ స్పెషల్ టీం సెలెక్ట్ చేయడం జరుగుతుందని వెల్లడించారు.

పంచారామ క్షేత్రం హుండీ ఆదాయం రూ.7.53 లక్షలు


క్షేత్రంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పంచారామ క్షేత్రం శ్రీసోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం హుండీలను గురువారం లెక్కించారు. 124 రోజులకుగాను రూ.7,53,338 ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణంరాజు తెలిపారు. బంగారం 11 గ్రాముల, 400 మిల్లీగ్రాములు, వెండి 275 గ్రాముల 100 మిల్లీ గ్రాములు, విదేశీ నగదు కెనడా డాలర్ నోటు 1, సింగపూర్ డాలర్ల నోట్లు 12, ఖతార్ రియల్స్ నోట్లు 10, అమెరికన్ డాలర్ నోట్లు 2 లభించినట్లు ఈవో తెలిపారు.

మెస్ టెండర్ల ఊసే లేదు

- ట్రిపుల్ ఐటీ మెస్ టెండర్లు అక్టోబర్ ప్రారంభంలోనే పిలుస్తామన్న డైరెక్టర్
- 20 రోజులు గడిచినా ఇప్పటికీ టెండర్లు పిలవని వైనం

అక్టోబర్ మూడో తేదీలోగా టెండర్లు పిలిచి, నవంబరు ఒకటి నుంచి నూతన మెస్ నిర్వాహకులతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు భోజనాలు అందిస్తాం.

– ట్రిపుల్‌ఐటీ ఇన్‌చార్జి డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ సెప్టెంబర్ 25న మీడియాకు వెల్లడి

మెస్ నిర్వహణ వ్యవస్థను సాధ్యమైనంత త్వరితగతిన బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

– త్రిసభ్య కమిటీ సభ్యులు సెప్టెంబర్ 20న మీడియా ముందు వెల్లడించిన విషయం



ట్రిపుల్ ఐటీలోని మెస్

నూజివీడు : ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ఎప్పటికి ప్రారంభమవుతుందో అంతుబట్టని విషయంగా మారింది. అక్టోబర్ మూడో తేదీలోగా మెస్‌ల నిర్వహణకు టెండర్లు పిలుస్తామని, ప్రతి రెండువేల మంది విద్యార్థులకు ఒక మెస్ ఉండేలా నూతన కేటరర్లను ఖరారు చేసి నవంబరు ఒకటో తేదీ నుంచి నూతన మెస్ నిర్వాహకులను సిద్ధం చేస్తామని చెప్పగా, ఇప్పటికే అక్టోబర్‌లో 17 రోజులు ముగిసిపోయాయి. ఇంతవరకు టెండర్లు కూడా పిలవకపోవడం గమనార్హం. ట్రిపుల్ ఐటీలో మెస్‌ల నిర్వహణ సరిగా లేదంటూ గతంలో ఉన్న అనూష కేటరర్స్, ఫైన్ కేటరర్స్‌ను తొలగించడంతో పాటు 6,600 మంది విద్యార్థులందరికీ భోజనాలు పెట్టే బాధ్యతను కేఎంకే మెస్‌కు అప్పగించారు. అంతమంది విద్యార్థులకు ప్రతిరోజూ ఒక్క మెస్సే రెండు పూటలా భోజనం, ఒకపూట టిఫిన్, సాయంత్రం స్నాక్స్ అందించాల్సి ఉంది. కేఎంకే కేటరర్స్‌కు అంత సామర్థ్యం ఉందా లేదా అనే ఆలోచన కూడా చేయకుండా ఏకపక్షంగా అప్పగించేయడం గమనార్హం. ఒకే ఒక కేటరర్‌కు ఎక్కువ రోజులు పెద్ద ఎత్తున విద్యార్థులను అప్పగించడం కూడా సమంజసం కాదనే అభిప్రాయాన్ని కాలేజీ ఎడ్యుకేట్ కమిషనర్ పోలా భాస్కర్ సైతం వెల్లడించారు. త్రిసభ్య కమిటీ గత నెల 20న నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చి అధికారులకు టెండర్ల విషయమై పలు సూచనలు చేసి వెళ్లింది. వారు వచ్చి వెళ్లి దాదాపు నెలరోజులవుతున్నా ఇంతవరకు టెండర్ల ప్రక్రియ ప్రారంభం కాకపోవడం గమనార్హం. ఇప్పటికీ టెండర్ల ప్రక్రియే రూపొందించలేదంటే మరో నెల రోజుల వరకు కొత్త కేటరర్లు వచ్చే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు. ఎందుకంటే టెండరు పిలిచిన తరువాత కనీసం 15 రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తరువాత ఫైనాన్స్ బిడ్, టెక్నికల్ బిడ్‌లను పరిశీలించాలి. అనంతరం టెండర్లను తెరవాలి. దీనంతటికీ కనీసం 20 రోజులకు పైగా సమయం పడుతుంది. అంటే.. మరో నెల రోజుల పాటు కేఎంకే కేటరరే 6,600 మంది విద్యార్థులకు భోజనం అందించాల్సి ఉంటుంది.

రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తాం

మెస్ టెండర్లకు సంబంధించి విధివిధానాలు రూపొందించడంలో జాప్యం నెలకొంది. అక్టోబర్ మొదటి వారంలోనే టెండర్లు పిలుద్దామని అనుకున్నా కుదరలేదు. అంతా సిద్ధం చేయడం పూర్తయినందున మరో రెండు రోజుల్లో టెండర్లు పిలుస్తాం.

– బి.లక్ష్మణరావు, ఏఓ, ట్రిపుల్ ఐటీ నూజివీడు

ఆధార్ అప్‌డేషన్‌కు మరోసారి అవకాశం

ఈనెల 22 నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరాలు


ఆధార్ నమోదు కేంద్రం

నూజివీడు : ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్నా, విద్యా ఉద్యోగాలకు, డ్రైవింగ్ లైసెన్స్‌కు, పాన్‌కార్డు పొందాలన్నా, బ్యాంక్ ఖాతా ప్రారంభించాలన్నా... ప్రతి ఒక్క దానికి నేడు ఆధార్ కార్డ్ తప్పనిసరైంది. అయితే ఈ ఆధార్‌కార్డులో తప్పులున్నా, వేలిముద్రలు అప్‌డేట్ కాకపోయినా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా మంది ఆధార్‌కార్డులు తీసుకొని 15 సంవత్సరాలు పూర్తయిన వారు ఉన్నారు. ఆధార్ కార్డు తీసుకొని పదేళ్లు దాటిన వారందరూ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాలని ప్రభుత్వం చెబుతుంది. ఆధార్ అప్‌డేషన్ చేసేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. పట్టణాల్లోని వార్డు సచివాలయాల్లోను, గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో గత ప్రభుత్వంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మరోసారి ఈనెల 22నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఈ శిబిరాల్లో నూతన ఆధార్‌కార్డుల కొరకు నమోదు, వేలిముద్రల అప్‌డేషన్, చిరునామాల మార్పు, ఆధార్‌కార్డుపై ఫొటో అప్‌డేట్, ఇతర తప్పులను మార్చుకునేందుకు వీలుంటుంది. అప్పుడే పుట్టిన పిల్లలకు కూడా బాల ఆధార్ తీసుకునే వీలుంది. అయితే ఐదేళ్ల వయస్సు దాటిన తరువాత పిల్లలందరూ తమ వేలిముద్రలను అప్‌డేట్ చేసుకోవాలి. అప్పుడే వారి వేలిముద్రలు నిక్షిప్తమవుతాయి. ఈ శిబిరాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు. వార్డు, గ్రామ సచివాలయాల్లోను, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో సైతం ఏర్పాటు చేయనున్నారు. గతంలో ఆధార్ కిట్లు సమకూరిన సచివాలయాలు ఈ సేవలను అందిస్తాయి.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాల్సిన వారి సంఖ్య

జిల్లా	5–15 వయస్సు	15–17 వయస్సు	18+వయస్సు వారు
ఏలూరు	72,688	1,13,144	1,85,832
పశ్చిమగోదావరి	48,730	68,256	1,16,986
మొత్తం	1,21,418	1,81,400	3,02,818

వైభవం.. వాసవీ మాత రథోత్సవం


రథోత్సవంలో వెండి కలశాలతో మహిళలు


వెండి రథంలో అమ్మవారి ఊరేగింపు

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం టూటౌన్‌లోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలోని అమ్మవారి వెండి రథోత్సవం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఈ రథోత్సవాన్ని ప్రారంభించారు. 108 వెండి కలశాలతో 108 మంది మహిళలు, ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన 250 మంది కళాకారులు, విభిన్న వాయిద్యాలు, నృత్య ప్రదర్శనలు, బాణసంచా పేలుళ్లు, తమిళనాడుకు చెందిన డప్పు కళాకారులు, లైటింగ్ నడుమ రథోత్సవం ఆకట్టుకుంది. ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వాసవి వనిత, మహిళా సంఘాలు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఆర్యవైశ్య నాయకులు పేరూరి కాశయ్య, కోన శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వబిలిశెట్టి నటరాజు, అధ్యక్షుడు కొర్లెపల్లి రాము, ఆర్యవైశ్య కార్యదర్శి నున్న సుందరరావు, రథోత్సవ కమిటీ చైర్మన్ నారాయణ రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శ్రీవారి డైరీ, క్యాలెండర్‌ల ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్‌లను చూపుతున్న చైర్మన్, ఈఓ

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి 2025 నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్లను ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు గురువారం ఆవిష్కరించారు. కొండపైన ఆయన ఛాంబర్‌లో ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ డీవీ భాస్కర్‌లతో కలసి వాటిని ప్రారంభించారు. డైరీ రూ. 150, సింగిల్ పేజి క్యాలెండర్ రూ.35, మల్టీపేజీల క్యాలెండర్ రూ.120కు విక్రయించాలని నిర్ణయించారు. దేవస్థానం ఫొటోస్టాల్‌లో భక్తులకు వీటిని అందుబాటులో ఉంచుతామని చైర్మన్ సుధాకరరావు తెలిపారు.

ఇరిగేషన్ పనుల పరిశీలన

నరసాపురం రూరల్: రైతులకు ముంపు గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా వివిధ ప్రాంతాల్లో ఇరిగేషన్ పనులను చేపట్టి పూర్తి చేసినట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి గురువారం ఆయన ఈ పనులను పరిశీలించారు. నరసాపురం మండలంలోని దర్బరేవు డ్రెయిన్‌కు సంబంధించి రూ.23 లక్షలతో చేపట్టిన పూడికతీత పనులు, యలమంచిలి మండలం కాజ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు సంబంధించి రూ.20 లక్షలతో చేపట్టిన షట్టర్ పనులు, రుస్తుంబాద మీడియం డ్రెయిన్, నత్తలావ మైనర్ డ్రెయిన్‌కు సంబంధించి రూ.7.70 లక్షలు, బియ్యపుతిప్పలో రూ.12 లక్షలతో చేపట్టిన నల్లీ క్రీక్ బండ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులకు సంబంధించి నిధులను గత సంవత్సరం నవంబర్‌లో అప్పటి కలెక్టర్ అత్యవసర నిధుల నుంచి మంజూరు చేశారని ఇరిగేషన్ శాఖ అధికారులు జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డికి వివరించారు. ఈ పర్యటనలో నరసాపురం ఆర్డీవో దాసి రాజు, నరసాపురం, పాలకొల్లు తహసీల్దార్లు టి.రాజరాజేశ్వరి, వై.దుర్గా కిషోర్, గోదావరి హెడ్‌వర్క్స్ డివిజన్ కె.కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ ఆకస్మిక తనిఖీ


విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని పోస్ట్ మెట్రిక్ ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌ను గురువారం రాత్రి జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ పీఓ పి.ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్టల్‌లో బాలికల వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజన వసతి, శానిటేషన్ అమలు, స్టడీ అవర్లో అమలవుతున్న విద్యా విధానాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ల నిర్వహణ అధ్వానంగా ఉండటంతో సిబ్బందిపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఐటీడీఏ డీడీ నాయుడు, తహసీల్దార్ కే చెల్లన్న దొర ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సత్యాగ్రహ దీక్ష


డీఈఓ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో మున్సిపల్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల కోసం ఇప్పటికే అధికారులకు ప్రాతినిధ్యం చేశామని, అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష చేశామని గుర్తు చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ ఖాతాలు తెరవాలని, బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, మున్సిపల్ యాజమాన్యంలో కూడా పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడేషన్ చేసి పదోన్నతులివ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలని, హెచ్‌ఎంలలో అర్హులైన వారిని అర్బన్ ఎంఈఓలుగా నియమించాలని కోరారు. అలాగే మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని, వర్గోన్నతి చెందిన అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల పోస్టులు మంజూరు చేయాలని, పని సర్దుబాటులో సుదూర ప్రాంతాలకు (50 కిలోమీటర్లు దాటి) ఇతర యాజమాన్యాల్లోని పాఠశాలలకు పంపించిన ఎస్జీటీ ఉపాధ్యాయులను తిరిగి మున్సిపల్ యాజమాన్యంలో అవసరమైన ఉన్నత పాఠశాలలో సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన పెద్ద ఎత్తున విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సత్యాగ్రహ దీక్షలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి, జిల్లా సహాధ్యక్షుడు జీ వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మున్సిపల్ వింగ్ కన్వీనర్ ఈ శివశంకరరావు, జిల్లా కార్యదర్శి ఎస్.రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి బీ సుభాషిణి, ఏలూరు నగర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ పర్వీన్ బేగం, జొన్నకూటి రాజారావు, నగర శాఖ నాయకులు కోరాడ కిరణ్ కుమార్, టీ మారుతి, కే మహంకాళి రావు, కేవీ అప్పారావు, కే దొరబాబు, కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. దీక్ష అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి వినతిపత్రం సమర్పించారు.

ఉరి వేసుకుని మహిళ మృతి

కైకలూరు: ఉరివేసుకుని ఓ మహిళ మృతి చెందింది. దీంతో ఆమె కూతురు (15), కొడుకు (10) అనాథలుగా మారారు. టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కైకలూరు మండలం వరహాపట్నం గ్రామానికి చెందిన పూజారి అనురాధ(35)కు ఏలూరు సమీప వ్యక్తితో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఆడబిడ్డ సంతానం. అయితే కొన్నేళ్ల క్రితం భర్త రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో అనురాధ బిడ్డతో పాటు కైకలూరులో నివాసముంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో ఓ వ్యక్తి పరిచయం ఏర్పడి నాలుగేళ్లు సహజీవనం చేశారు. వీరికి బాబు జన్మించాడు. కుమార్తెను ఏలూరు సమీపంలోని హాస్టల్‌లో చదివిస్తోంది. సహజీవనం సాగిస్తున్న వ్యక్తి తాగి రోజు ఆమెను కొట్టడంతో పోలీసులకు ఫిర్యాదు చేసి అతనితో దూరంగా ఉంటుంది. కైకలూరు కరకట్ట వద్ద బాబుతో జీవిస్తోంది. ఈమె తాపీ పనులకు వెళ్లిన క్రమంలో ఆటపాక గ్రామానికి చెందిన తాపీ పనిచేసే వ్యక్తితో పరిచయం సహజీవనానికి దారితీసింది. అతనికి ఇటీవల పెళ్లిసంబంధాలు రావడంతో కొద్ది రోజులుగా అనురాధ, యువకుడు బయటకు వెళ్లిపోయారు. తిరిగి వచ్చిన తర్వాత యువకుడు ఆమెకు దూరంగా ఉన్నాడు. ఈ క్రమంలో సమీప నివాసితులతో ఆత్మహత్య చేసుకుంటానని అనురాధ చెప్పింది. వద్దని వారు వారించారు. ఎవరూ లేకపోవడంతో బుధవారం సాయంత్రం ఉరివేసికుని ఆత్మహత్యకు పాల్పడింది. దహన సంస్కారాలకు బంధువులు ముందుకు రాకపోవడంతో పంచాయతీ, పోలీసులు గురువారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. టౌన్ ఏఎస్సై మల్లిఖార్జునరావు కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు


యలమంచిలి: తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని కొంతేరు గ్రామానికి చెందిన రేజేటి కోమలి గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కర్టీడి గుర్రయ్య తెలిపారు. కోమలికి రెండేళ్ల క్రితం హైదరాబాద్‌కు చెందిన పూడివలస రాజుతో క్రిస్టియన్ సంప్రదాయంలో వివాహమైంది. వివాహ సమయంలో రూ.3.50 లక్షలు నగదు, రెండు కాసులు బంగారం కట్నం ఇచ్చారు. వీరి సంసారం ఆరు నెలలు బాగానే సాగింది. ఆ తర్వాత నుంచి అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని కోమలి ఫిర్యాదులో పేర్కొంది. గత నెల 14న అదనపు కట్నం తీసుకురాకపోతే కుదరదని తరిమేయడంతో పుట్టింటికి వచ్చేసింది. ఈ మేరకు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

వివాహిత ఫిర్యాదు..

కాళ్ల: అదనపు కట్నం వేధింపులపై వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరుపాడు గ్రామానికి చెందిన ఆదిగిరి నాగలక్ష్మికి ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన మావుళ్ళయ్యతో సుమారు 26 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక అమ్మాయి, అబ్బాయి సంతానం. అయితే ఇప్పుడు ఆమెను అదనంగా లక్ష రూపాయలు అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, అతని సోదరుడు, అత్తమామలు వేధిస్తున్నారంటూ నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా..

అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా వరాహ పుష్కరిణి


వరాహ పుష్కరిణి మెట్లపై మద్యం సేవిస్తున్న వ్యక్తులు

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారికి చెందిన వరాహ పుష్కరిణి మందుబాబులకు అడ్డాగా మారింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన రాష్ట్రంలోనే అతి పెద్దదైన వరాహ పుష్కరిణి (మెట్ల కోనేరు) అసాంఘిక కార్యకలాపాలకు వేదికైంది. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో రాత్రయితే చాలు వరాహ పుష్కరిణి మెట్లపై మందుబాబులు మద్యపానం, ధూమపానం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో మద్యం సీసాలు, చికెన్ వ్యర్థాలు, వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది. వరాహ పుష్కరిణి పవిత్రతను కాపాడి మందుబాబుల ఆగడాలు అరికట్టాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు. ఇదే విషయంపై ఎస్సై శుభశేఖర్ మాట్లాడుతూ వరాహ పుష్కరిణి మెట్లపై మద్యపానం, ధూమపానంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.